వాళ్ళకి ఇష్టమైన కళని కనుక్కోగల్గుతారు. అందుకని ఎవ్వర్నీ మేము మీరు ఇదే నేర్చుకోవాలని నిర్బంధించం. వాళ్ళు మారుతుంటే ఒప్పుకుంటాం. ఆఖరికి వాళ్ళకిష్టమైన కళ దొరకగానే వాళ్ళు దానికే అంకితమైపోతారు. అంతవరకూ ఓపిక పడతాము. ఇలా చేయడంవల్ల వాళ్ళ అభిరుచిని సరిగ్గా కనుక్కున్న వాళ్ళమవుతాం. అప్పుడు వాళ్ళు శ్రద్ధగా నేర్చుకుంటారు. బాలభవన్‌లో శిక్షణ పూర్తయ్యేసరికి బేసిక్స్ పూర్తిగా అర్థమవుతాయి. పిల్లలందరి దృష్టిని ఇలాంటి సత్కాలక్షేపాలవేపు మళ్ళించాల్సిన అవసరం ఎంతో వుంది. కేవలం వాళ్ళకి కళల్లో తర్ఫీదు నివ్వడమేకాకుండా వాళ్ళ ఆలోచనలు చెడువేపు మళ్ళకుండా కాపాడిన వాళ్ళమూ అవుతాము. బాలభవన్ లోకి అడుగుపెట్టిన తర్వాత ఇంతమంది పిల్లల్ని ఇలా చూస్తుంటే ఎంతో ఉత్సాహంగా వుంటుంది. నన్ను చూడదల్చుకున్న పిల్లలెవరైనా వుంటే ఏసమయంలోనయినా కలవడానికి అవకాశం కల్పించాను. వాళ్ళు వచ్చి సరాసరి నన్ను కలుస్తుంటారు ..." అన్నారు బాలభవన్ డైరెక్టర్ కుమారి వాసిరెడ్డి సీతాదేవిగారు.

వేసవి కాలం శలవులు వచ్చాయంటే చాలు బాలభవన్ నిండా పిల్లలే అయిదు నుంచి పధ్నాలుగు సంవత్సరాల లేత గులబీలతో బాలభవన్ వింత కాంతుల్ని విరాజిమ్ముతుంటుంది, పబ్లిక్ గార్డెన్స్‌కే తలమానికంగా తయారవుతుంది. మామలు రోజుల్లో అయితే స్కూల్ అయిపోయిన తర్వాత షిఫ్టులలో వచ్చి పిల్లలు నేర్చుకుంటూ వుంటారు. శలవుల్లో పగలంతా పిల్లలమయం బాలభవన్. తాము నేర్చుకునే శిక్షణ పూర్తి కాగానే లైబ్రరీలోనో, సైన్స్ క్లబ్‌లోనో, కంప్యూటర్ గేమ్స్ దగ్గరో లైన్ కడ్తుంటారు పిల్లలు. పిల్లల ఆలోచనలు పెంపొందించుకోవడానికి ఉపయోగపడే 'బాలభవన్' సేవని కొనియాడల్సిందే. •••





# సింహాసనం

## పి.వి.ఆర్. శివకుమార్

గోధూళివేళ - మేతకోసం సుదూర తీరాలకి వెళ్ళే పక్షులన్నీ తిరిగి గూళ్ళకి చేరుకునేవేళ ... శతవర్షాలు చూసి, శతాధిక శాఖోపశాఖల్తో విస్తరించిన వృక్షరాజం పక్షుల కిలకిలారావాల్తో ఎంత సందడిగా వుంటుందో...

ఉదయం పదిగంటలవేళ ఆ ప్రభుత్వ కార్యాలయశాఖ అంతే సందడిగా వుండటం పరిపాటి. 'రాజు వెడలె రవి తేజములలరగ' అన్నట్టుగా, ముందుగా కారుహారన్ చప్పుడు, ఆ వెనక ఆఫీసు ప్యూన్ బ్రీఫ్‌కేసుతో ప్రవేశం, అతడి వెనకే హుందాగా మేనేజర్ గారి ఆగమనం - జరిగే వేళకి అంతా సర్దుమణిగి సీట్లకి అతుక్కుని కూర్చోటం అక్కడి దిన చర్య.

అయితే ఆరోజు వాతావరణం, అందుకు కొంత భిన్నంగా వుంది. పదకొండు గంటలు దాటి పోయినా ఇంకా కారు చప్పుడు వినరాలేదు. రాజుగారి రంగప్రవేశం జరగలేదు. కారణమూ తెలియలేదు!

"ఏమయ్యిందివేళ? గురువుగారు శలవు గాని తీసుకున్నారా?"


"శలవా? ముందుగా తెలియందే శలవు తీసుకోవటం ఆయన రికార్డులోనే లేదే!"

చిన్న గుమస్తాలు మొదలు హెడ్ గుమస్తా దాకా అంతా చర్చలో మునిగి తేల్తుండగా ఆఫీసు ప్యూన్ అప్పలయ్య వంటరిగా వచ్చాడు - ఆ పిడుగు లాటి వార్త తీసుకుని!

ఆఫీసుకి బయల్దేరాలని మామూలుగానే లేచి తయారవుతున్న మేనేజర్ గారికి ఉదయం ఎనిమిది గంటలవేళ హఠాత్తుగా హార్ట్ ఎటాక్ వచ్చిందిట! వెంటనే హాస్పిటల్లో చేర్చారట.

హుటాహుటిన స్టాఫంతా హాస్పిటల్‌కి బయల్దేరారు. కానీ వాళ్ళు హాస్పిటల్‌కి చేరుకునేదాకా ఏమీ ఆగలేదు. మేనేజర్ గారి ఇహలోక యాత్ర ముగిసిపోయింది.

ఇంతవరకూ చెప్పింది ఉపోద్ఘాతమే! ఇక్కడే మొదలయింది అసలు కథ!



పోయి నోళ్ళు అందరూ మంచోళ్ళే! అలాగని పోయినోళ్ళతో పాటు మనమూ పోలేం కదా! అందునా గవర్నమెంటు (పని నడిచినా/నడవకపోయినా) ఆఫీసన్నాక అది నడిచితీరాల్సిందే కదా! అందుకే, పోయిన మేనేజర్‌గారి స్థానే మరో మేనేజర్‌గారు వచ్చేదాకా చిన్నాఫీసర్‌గారే ఆ ఆఫీసుకి అధిపత్యం వహిస్తారని ఆర్డర్ వచ్చింది. చిన్నాఫీసర్‌గారు మేనేజర్ గదిని తాత్కాలికంగా ఆక్రమించేరు. గదినయితే ఆక్రమించారుగానీ, గతించిన మేనేజర్‌గారి కుర్చీని మాత్రం ఆక్రమించలేదాయన. అందుక్కారణం సదరు దివంగత మేనేజర్‌గారి మీద భక్తి శ్రద్ధలే అనుకుంటే మనం పొరబడినట్లే!

సదరు కుర్చీకో చిన్న కథవుంది. ఆ కుర్చీ ఆ శాఖ ప్రారంభమయిన నాటి నించీ ఎందరో మేనేజర్లు ఆ కుర్చీలో కూర్చున్నారు. ప్రమోషన్ల మీదో, రిటైర్మెంటు మీదో నిష్క్రమించేరు! అందరు మహానుభావులు కూర్చున్న ఆ కుర్చీమీద తను ఎప్పటికయినా కూర్చోవాలని ఆయనకో గొప్ప కోరిక వుండేది. ఆ కోరిక తీరి ఆయన మేనేజర్ అయ్యేనాటికి ఆ కుర్చీ 'మరింక నేను సేవలు చేయలేనంటూ' విరిగి కూర్చుంది. అయితే సెంటిమెంటు బద్ధులైన మేనేజర్‌గారు దాన్నే రిపేర్లు చేయించి వాడటం ప్రారంభించేరు. దానా దీనా అదిప్పుడు మరింత దీనావస్థలో పడింది.

రానున్న కొత్త మేనేజర్‌గారికి ఈ కుర్చీని సమర్పించి ఆయన ఆగ్రహానికి గురికావటం చిన్నాఫీసర్‌గారికి యిష్టం లేకపోయింది. అందుకే మరో నదరైన 'సింహాసనాన్ని' తెప్పించి రానున్న మేనే



జర్‌గారికి అర్పించి ఆయన మెప్పు పొందాలని ఆయన దూరాలోచన చేశారు. అంతదాకాకూడా ఆ కుర్చీలో తను కూర్చోరాదనీ నిశ్చయించుకున్నారు. అందుకే తన కుర్చీనే ఆ గదిలో వేయించుకు కూర్చున్నారు. కూర్చున్న వెంటనే బెల్లు కొట్టి అప్పలయ్యని పిల్చేరు. అతనిద్వారా హెడ్ గుమాస్తాకి కబురెట్టేరు.

"మనం వెంటనే ఒక మాంచి సింహాసనంలాటి కుర్చీ తెప్పించాలి. రాబోయే మేనేజర్‌గార్ని కూర్చోమని ఈ విరిగి, అతుకులుపడి ఊగిసలాడుతున్న కుర్చీని చూపించలేంకదా! అంచేత ఓ కొత్తకుర్చీ కోసం కొటేషన్లు తెప్పించండి" అని ఆర్డర్ వేశారు.

"అలాగేసార్! లోకల్ ఫర్నిచర్ మాన్యుఫాక్చరర్స్ అందరి దగ్గరినించీ లేటెస్ట్ మోడల్ కుర్చీలకి కొటేషన్స్ తెప్పిస్తాను."

"అహఁ... అలా వొద్దు. లోకల్ మాన్యుఫాక్చరర్స్ అంటే... రేపు ఆడిటర్లు వొచ్చి, ఈ కొటేషన్స్‌లో ఏవో లొసుగులున్నాయని ఈకలు పీకి మన పీకలకి చుడతారు.

అందుకే... నేషనల్ లెవెల్లో పేరుబడ్డ ఫర్నిచర్ కంపెనీలనించి కాటలాగులూ, ధరల పట్టికలూ తెప్పించండి.

వాటిలోంచి ఎన్నుకున్నామంటే, ఏ గొడవా వుండదు."

చిన్నాఫీసర్‌గారి ముందుచూపుకి హెడ్ క్లర్క్‌క్కూడా సంతోషం వేసింది.

"అవశ్యం అలాగే కానిద్దాం" అన్నారు.

ఆరోజే అన్ని ప్రసిద్ధ కంపెనీలకి రాశారు. కేటలాగులూ, ప్రైస్‌లిస్టూ పంపించమని.

● ● ●

రెండువారాలు గడిచి పోయినయ్. కొత్త మేనేజర్‌గారి సెలెక్షన్ జరిగిపోయింది. హెడ్డాఫీస్‌నించి ఆయనకి ఆర్డర్లు కూడా వెళ్ళిపోయినయ్. సదరు కాపీ ఈ శాఖక్కూడా వచ్చింది.

చిన్నాఫీసర్‌గారికి కంగారు పుట్టింది.

"కుర్చీ ... కుర్చీ..." అనుకుంటూ హెడ్‌క్లర్క్‌ని పిల్చారు.

"ఇదిగో ఈ ఆర్డర్ కాపీ చూడండి. మన ఆఫీస్‌కి మేనేజర్ సెలెక్షన్ జరిగింది. అయితే ఆయనగారికి ఆ బ్రాంచ్ లో రిలీవ్ కావటానికి మరోనెల వ్యవధి అవసరమట! అందుకే ఆ తర్వాతే వచ్చి ఇక్కడ చార్జి తీసుకుంటారని హెడ్డాఫీస్‌కి వాళ్ళు రాశారు."

"మంచిదిసార్" అన్నాడు హెడ్, ఆర్డర్ని, ఉత్తరాన్ని చదివి.

"మంచిది సరే, మరి కుర్చీసంగతి?"

"అవి...ఒక మూడు కంపెనీలనించి కొటేషన్స్ వచ్చాయండి. మరో రెండు కంపెనీలనించి యింకా రావాల్సివుంది."

"రావల్సిన రెండు కంపెనీలకి టెలిగ్రాం పంపండి. వచ్చిన మూడు కొటేషన్లూ యిలా తీసుకురండి" చెప్పాడు హడావిడిగా ఆయన.

ఫైలు తెచ్చాడు హెడ్ గుమాస్తా.

ఇద్దరూ కల్సి ఆ ప్రైస్ లిస్టులూ, కేటలాగులూ తిరగేశారు.

ఆ మూడు కేటలాగుల్లోనూ వున్న కొన్ని డిజైన్లు యిద్దరికీ నచ్చాయి.

మళ్ళా తిరగేసి, నచ్చిన డిజైన్లన్నిటిలోకీ ఖరీదైన ఒక మోడల్ సెలెక్ట్ చేసుకున్నారు. అది దేశంలో బాగా పేరుబడ్డ ఫర్నిచర్ తయారీ సంస్థవారి మాడల్.

"వెరిగుడ్! ఈ సంస్థపేరు చూసే మన మేనేజర్‌గారు గుమ్మైపోతారు! ఇహ యీ మోడల్ చూస్తే ఆయన రాచరీవి అబ్బినట్టు మురిసి పోవల్సిందే!"

అన్నాడు హెడ్ గుమాస్తా.

అవునన్నట్టు తల వూపాడు చిన్నాఫీసర్‌గారు. అంతలో ఆయన దృష్టి అదే ధరల పట్టికలో మరో పేజీ వైపుమళ్ళింది.

"అరె! ఇక్కడింకా కొత్త మోడల్స్ ధరలు యిచ్చారయ్యా! అబ్బో... దీని ఖరీదు అయిదువేల రెండొందలట!"

అన్నాడు గుడ్లు మిటకరిస్తూ.

హెడ్ గుమాస్తా కూడా చూశాడది. నిజమే, ఆ మోడల్ కుర్చీ ధర మరీ ఎక్కువగా వుంది.

"దీనిడిజైన్ చూద్దాం కేటాలాగ్‌లో," అంటూ కేటలాగ్ తెరిచాడు.

ఆ కేటలాగ్‌లో సదరు మోడల్‌లేదు!

"వెంటనే యీ కేటలాగ్ పంపమని ఆ కంపెనీకే టెలిగ్రాం యివ్వండి!" అన్నాడు చిన్నాఫీసర్‌గారు.

"అలాగే" అన్నాడు గుమాస్తా.

నాలుగు రోజుల తర్వాత జవాబొచ్చింది ఆ కంపెనీ నించి – 'సదరు



కేటలాగ్ అవుటాఫ్ ప్రింట్ అనీ-ప్రింట్ కాగానే పంపుతామనీ!'

"నాబొంద! వాడు ప్రింట్ చేసేదాకా మన అవసరం ఆగుతుందేమిటి? సరే... పోనివ్వండి... ఇంత ఖరీదుకి తగ్గ ఠీవి ఆ కుర్చీకి ఎలాగూ వుంటుంది! వెంటనే ఈ కుర్చీకి ఆర్డర్ పంపండి." అన్నాడు చిన్నాఫీసర్.

"ముప్పైశాతం అడ్వాన్సూ, మిగతా డెబ్బై శాతమూ బాంక్ డాక్యుమెంట్ల ద్వారా చెల్లించాల్సి వుంటుందండి!"

పేమెంట్ టరమ్స్ చదివి చెప్పాడు హెడ్.

"ఓ. కె. అలాగే పంపించండి" "ఇవాళే చెక్కు, ఆర్డరూ పంపించండి" అన్నాడు చిన్నాఫీసర్‌గారు.

ఆర్డర్ అడ్వాన్స్‌తో సహా వెళ్ళిపోయింది.

● ● ●

మరో మూడు వారాలు గడిచాయి. మేనేజర్‌గారు మరో రెండ్రోజుల్లో వస్తున్నట్టు టెలిగ్రాం అందింది ఆ బ్రాంచ్‌కి.

చిన్నాఫీసర్‌గారు కంగారుగా బెల్లు-వాయించారు. హెడ్ రాగానే టెలిగ్రాం చూపించారు.

"అయ్యా....కుర్చీ గురించే కదండి"

"అవునూ....అవును!"

"ఏం ఫర్వాలేదు! కుర్చీ వచ్చేస్తోందండి!"

"ఎప్పుడు? ఎప్పుడయ్యా?"

"రేపటెల్లుండిలోగా వచ్చేస్తుంది. ఇవాళే బాంక్‌నించి డాక్యుమెంట్స్ రిలీజ్ చెయ్యమని యింటిమేషన్ వచ్చిందండి! ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుకి ఫోన్ చేశాను. వాళ్ళ దగ్గరకి యింకా పాకింగ్ కేస్ రాలేదుట! వాళ్ళ బ్రాంచ్‌కి ఫోన్ చేసి వెంటనే కనుక్కోమని చెప్పాను. ఏదిఏమయినా సరే రేపటెల్లుండిలోగా మెటీరియల్ మనకి డెలివర్ చెయ్యాలని మళ్ళా ఫోన్ చేసి చెప్తాను."

వివరించాడు హెడ్.

"ఓ.కె. అలాగే చెయ్యండి! ఎల్లుండిలోగా ఆకుర్చీ మన ఆఫీసుకి రావాల్సిందే"

"చిత్తం."

గదిలోంచి బయటకి వస్తూనే మరో ఫోన్ కొట్టాడు హెడ్, ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుకి. అకౌంటెంట్‌ని పిల్చి బాంక్ డాక్యుమెంట్స్ రిలీజ్‌చేసి తీసుకురమ్మని చెప్పాడు.

● ● ●

ఎల్లుండి రావటానికి మూణ్ణిమిషాల్లు మాత్రమే పట్టింది చిన్నాఫీసర్ గారికి.


గంటకోసారి చొప్పున ట్రాన్స్‌పోర్ట్ కంపెనీకి ఫోన్ చేయిస్తూనే వున్నాడాయన హెడ్ చేత.

చివరికి యివాళ ఉదయం లారీ పూర్తి పొలిమేరలకి చేరిందనీ, అక్ట్రాయ్ కట్టి, మధ్యాహ్నం వేళ్టికి పాకింగ్‌కేస్ డెలివరీ చేస్తామని చెప్పారు ట్రాన్స్‌పోర్టర్లు.

నమ్మకం కుదరటానికి హెడ్ గుమాస్తాని కార్లో అక్ట్రాయ్ పోస్ట్‌దగ్గరకి పంపించి మరీ చూసిరమ్మన్నాడు చిన్నాఫీసర్‌గారు.

హెడ్ గుమాస్తా తిరిగొచ్చి,

"అవున్సార్! నిజమే! మన ప్యాకింగ్ కేసు లారీలో వుంది. మరో గంటలోగా ఆఫీసుకి చేరుస్తానన్నాడు" అని చెప్పాక ఆయననుదుటి చెమటలు తుడుచుకున్నాడు




మేనేజర్‌గారు విచ్చేసేది రేపుదయం ఫ్లైట్‌లోనే మరి! ఇంత శ్రమపడీ ఆ కుర్చీని తెప్పించేక, అది మరొక్కరోజు ఆలస్యమైనా ... తనప్లాన్ చెడిపోతుంది! మేనేజర్‌గారు వచ్చి ఒక్కపూట ఆ పాత కుర్చీలో కూర్చున్నా యింతశ్రమా వృధాయేకదా! సదరు సింహాసనాన్ని ఆయనకి సగౌరవంగా స్వాగతం పలికేలా ఏర్పాటు చేయటమే తనధ్యేయం మరి!

అనుకున్నట్టే మధ్యాహ్నం మూడింటికి దిగింది లారీలోంచి ఆ ఆఫీసు ముంగిట్లో సదరు పాకింగ్ కేసు!

సంబరంగా దానిదగ్గరకు నడిచారు చిన్నాఫీసర్‌గారు. ఆయనవెంటే "హరి వెంటన్ సిరి, లచ్చివెంట నవరోధ్రవాతముల్ ...." అన్నట్టుగా హెడ్‌గుమాస్తా, మిగతా స్టాఫ్‌కూడా నడిచారు.

ఇద్దరు అటెండర్లనీ పిల్చి కేసు వూడదీసేపని అప్పజెప్పాడు హెడ్‌గుమాస్తా.

టక్ టక్ మని వాళ్ళు సీళ్ళమీద సుత్తి దెబ్బలు కొడుతుంటే, అవి తన బట్టతల మీదే పడుతున్నట్టుగా కంగారు పడిపోయాడు చిన్నాఫీసరుగారు!

"భద్రం .... భద్రం .... నెమ్మదిగా కొట్టండి! లోపలున్న కుర్చీకి తగలగల్దు" అంటూ అరిచాడు. అక్కడికి ఆ లోపల కొత్త మేనేజర్‌గారే కూచున్నట్టూ, ఇద్దరటెండర్లూ కల్సి సదరు మేనేజర్‌గారి మీదే సుత్తి దెబ్బలు వేస్తున్నట్టూ విలవిల్లాడిపోతూ!

అటెండర్లు ఎలాగో అలా తంటాలు పడి, చివరికి ఆ పాకింగ్‌కేసు చెక్కలు వూడదీశారు. ఆ లోపల ముదురు నీలం రంగు ప్లాస్టిక్ కవరుతో కప్పబడి ముసుగులో వున్న కొత్త పెళ్ళికూతురులాగా ముడుచుకు కూర్చుంది ఆ సింహాసనం.

స్వయంగా సదరు ప్లాస్టిక్ కవర్ని పైకి లాగారు చిన్నాఫీసర్‌గారు.

'కెవ్వు' మన్న కేక వెలువడింది ఆ వెంటనే అయన నోటినించి!

అంతా ఆదుర్దాగా ముందుకి తొంగి చూశారు! అందరికీ వున్నఫళంగా నిలువు గుడ్లు పడ్డాయి!

"ఇదేమిటయ్యా ఇది తగలడింది?" అరిచాడు చిన్నాఫీసర్‌గారు.

"కేటలాగ్ పంపమంటే ప్రింట్‌లో లేదని కొంప ముంచాడుసార్ ఆ కంపెనీ వాడు!"

డాపురుమన్నాడు హెడ్ గుమాస్తా!

చిన్న గుమాస్తాలందరికీ ఆశ్చర్యంతో కన్న పొట్ట చెక్కలయ్యేలా నవ్వొస్తోంది. అయితే మయసభలో పాంచాలినిచూసి పండిపడ్డ సుయోధన సార్వభౌముడు గుర్తువచ్చి నోళ్ళని రెండు చేతుల్తోనూ ముఖం తుడుచుకుంటున్న పోజులో మూసుకున్నారు వాళ్ళు.

"అయిదువేల రెండొందలు! అవి కాక టాక్సులు, ట్రాన్స్‌పోర్ట్, అక్ట్రాయ్, నా బొంద ... యింతఖర్చు .... అవతల శరవేగంతో దూసుకొచ్చేస్తున్న మేనేజర్ గారు! ముందుగా ఈ కుర్చీ కేసునే టేకప్ చేసి మన భరతం పడతారు! పాతకుర్చీని అలాగే ఆయనకిఅప్పజెప్పినా సరిపోయేది! ఇప్పుడు ఆ పని ఎలాగూ తప్పక పోగా, కొత్త ప్రమాదం కొని తెచ్చుకున్నాం."

"చచ్చామయ్యా హెడ్డూ!"

ముచ్చెమటల్తో ముఖం తడిసిపోగా, గొంతు మాత్రం పొడారి పోయింది చిన్నాఫీసర్ గారికి!

అసలు సంగతేమిటో, తనని పనిగట్టుకుని ఆ ఆఫీసుకి ఎందుకు పిలిపించారో ఎంత మాత్రం అర్థంకాక అలాగే ఆశ్చర్యంగా నిలబడి పోయివుంది - నిజమైన సింహాసనంలాగే మెరిసిపోతున్న - ఆ దివ్యమైన, మంగలిషాపుల్లో వాడబడే ఖరీదైన మంగలి కుర్చీ!!!

